సుత్తపిటకం

ఖుద్దక నికాయం

# నాగసేన-మిళింద సంవాదం

(మిళింద ప్రశ్నలు)

తెలుగు సేత

సద్ధర్మ మహోపాధ్యాయ

**అన్నపరెడ్డి బుద్ధఘోషుడు**

ఎమెస్కో

# విషయసూచిక

## నాగసేన - మిళింద సంవాదం - 17

### 1. బాహిర కథ - 20

### 2-3 నాగసేన - మిళింద సంవాదం - 46


**1. మహా వర్గం** **46 - 64**

నామ ప్రశ్న - 46; వర్ష గణన ప్రశ్న - 50; ఎలా సంవాదం జరపాలి? - 50; అనంతకాయ ప్రశ్న - 52; ప్రవ్రజ్య ప్రశ్న - 53; పునర్జన్మ ప్రశ్న - 54; అవధాన (శ్రద్ధ) ప్రశ్న - 55; అవధాన లక్షణ ప్రశ్న - 55; శీల లక్షణ ప్రశ్న - 56; ప్రశాంతి లక్షణం శ్రద్ధ ప్రశ్న - 57; ఆకాంక్ష శ్రద్ధా లక్షణ ప్రశ్న - 58; విరియ లక్షణ ప్రశ్న - 59; సతి లక్షణ ప్రశ్న - 60; సమాధి లక్షణ ప్రశ్న - 61; ప్రజ్ఞా లక్షణ ప్రశ్న - 62; నానా ధర్మాల ఏక ఫల నిష్పన్న ప్రశ్న - 63.

**2. అద్ధాన (కాల) వర్గం** **65 - 78**

ధర్మ సంతతి ప్రశ్న - 65; పునర్భవ ప్రశ్న - 67; జ్ఞానం, ప్రజ్ఞ ప్రశ్న - 68; తిరిగి పుట్టనివాడు దుఃఖాన్ని అనుభవిస్తాడా? - 70; వేదనా ప్రశ్న - 71; తిరిగి పుట్టిన దేది? ప్రశ్న - 72; థేర పునర్భవ ప్రశ్న - 76; నామ-రూప ప్రశ్న - 77; దీర్ఘ కాల ప్రశ్న - 77.

**3. విచార వర్గం** **79 - 95**

కాలారంభ ప్రశ్న - 79; ఆరంభ బిందు ప్రశ్న - 79; ఆరంభ బిందువు ప్రశ్న - 81; సంఖార జనన ప్రశ్న - 82; సంఖారాలు క్రమ పరిణాముల ప్రశ్న - 83; వేదగూ (ఆత్మ) ప్రశ్న - 85; చక్షు విజ్ఞానాదుల ప్రశ్న - 88;

స్పర్శ లక్షణ ప్రశ్న – 91; వేదనా లక్షణ ప్రశ్న – 91; సంజ్ఞా లక్షణ ప్రశ్న – 92; చేతన లక్షణ ప్రశ్న – 92; విజ్ఞాన లక్షణ ప్రశ్న – 93; వితర్క లక్షణ ప్రశ్న – 94; విచార లక్షణ ప్రశ్న – 94.

**4. నిర్వాణ వర్గం 96 - 104**

స్పర్శాది విభజన ప్రశ్న – 96; నాగసేనుని ప్రశ్న – 97; పంచాయతనాల కర్మఫలం ప్రశ్న – 97; కర్మనుబట్టి మనుషులు వివిధ రకాలు ప్రశ్న – 98; ప్రయత్న లక్ష్యం ప్రశ్న – 99; నరకాగ్ని మహా తాపం ప్రశ్న – 100; భూమి ఆధార ప్రశ్న– 102; నిరోధమే నిర్వాణమా? ప్రశ్న – 103; నిర్వాణ లభ్యత ప్రశ్న – 103; నిర్వాణ సుఖం తెలుస్తుందా? ప్రశ్న – 104.

**5. బుద్ధ వర్గం 105 - 110**

బుద్ధుడు ఉన్నాడా లేడా ప్రశ్న – 105; బుద్ధుని సర్వశ్రేష్ఠత్వం ప్రశ్న – 105; బుద్ధుని అనుత్తరతను ఎరిగే ప్రశ్న – 106; ధర్మ దృష్టి ప్రశ్న – 107; భవాంతర గమనం లేకుండ పునర్జన్మ ప్రశ్న – 107; వేదగూ (ఆత్మ) ప్రశ్న – 108; శరీరం నుంచి శరీరానికి పోయేది ఏదైనా ఉందా? ప్రశ్న – 108; కర్మ ఫల అస్తి ప్రశ్న – 109; పునర్జన్మ జ్ఞాన ప్రశ్న – 109; బుద్ధుని లాంటి వ్యక్తి ఉన్నాడా? ప్రశ్న – 110.

**6. సతి వర్గం 111 - 118**

భిక్షువులకు శరీరం ప్రియమైనదా? ప్రశ్న – 111; బుద్ధుడు సర్వజ్ఞుడు – ప్రశ్న – 112; మహా పురుష లక్షణ ప్రశ్న – 113; భగవాన్ బ్రహ్మచారియా?– ప్రశ్న – 114; భగవాన్ ఉపసంపద – ప్రశ్న – 114; అశ్రువులు ఔషధమా? ప్రశ్న – 115; సరాగులకు, వీతరాగులకు తేడా ప్రశ్న – 115; ప్రజ్ఞ ఎక్కడ ఉంటుంది? ప్రశ్న – 116; సంసార ప్రశ్న – 116; చిరకాల స్మరణ ప్రశ్న – 117; సతి ఆత్మగతత్వ ప్రశ్న – 117.

**7. అరూప ధర్మ విశ్లేషణ వర్గం 119 - 134**

సతి ఎన్నివిధాలుగ కలుగుతుంది? ప్రశ్న – 119; బుద్ధ గుణ సతి (స్మృతి) ని పొందే ప్రశ్న – 120; దుఃఖపరిహార (యత్న) ప్రశ్న – 121; బ్రహ్మలోక ప్రశ్న –123; రెండు లోకాలలో సమ ఉత్పన్న ప్రశ్న – 124; బోధి అంగ

(బోజ్ఝంగ) ప్రశ్న – 125; పాపపుణ్యాల అల్పానల్పాల ప్రశ్న – 125; తెలిసి చేసినదా, తెలియక చేసినదా – ఏది బహుతర అపుణ్యం – ప్రశ్న – 126; ఈ శరీరంతో ప్రపంచంలో ఎక్కడికైనా పోగలిగినవాడు ఉన్నాడా? ప్రశ్న – 127; యోజనాల పొడవు ఎముక – ప్రశ్న – 127; శ్వాస నిరోధ ప్రశ్న – 128; సముద్రం ప్రశ్న – 128; సముద్ర ఏకరస ప్రశ్న – 129; సూక్ష్మం ప్రశ్న – 129; విజ్ఞాన నానార్థ ప్రశ్న – 130; బుద్ధుడు చేసిన దుష్కర కర్మ – 130; మిళింద ప్రశ్నల పరిష్కారాల గురించి – 132.

**మేణ్డక ప్రశ్నల ఆరంభ కథ** **134 – 140**

మంత్రాంగానికి పనికిరాని ఎనిమిది ప్రదేశాలు – 135; అష్ట మంత్రాంగ (మన్త) వినాశక పురుషులు – 136; రహస్య మంత్రాంగ విధ్వంసకులు – 137; అష్టప్రజ్ఞా లబ్ధికారణాలు –138; ఆచార్య గుణాలు – 138; ఉపాసక గుణం – 139

## 4. మేణ్డక ప్రశ్నలు

**1. ఇద్ధి బల వర్గం** **141 – 194**

చేసిన పూజల సఫల – 141; ప్రశ్న – బుద్ధుడు సర్వజ్ఞుడేనా? ప్రశ్న – 148; దేవదత్తుని ప్రవ్రజ్య ప్రశ్న – 154; భూకంపం ప్రశ్న – 160; శివి (బి) రాజ చక్షుదాన ప్రశ్న – 166; గర్భధారణ ప్రశ్న – 170; సద్ధర్మంతర్ధాన ప్రశ్న – 178; అకుశల ఛేదన ప్రశ్న – 182; ఇంక చేయవలసింది ఏమీ లేదు ప్రశ్న – 187; మనశ్శక్తుల దర్శన ప్రశ్న – 189.

**2. అభేద్య వర్గం** **195 – 217**

అల్ప, చిన్న నియమాల ప్రశ్న – 195; అవ్యాకరణీయ ప్రశ్న – 197; మృత్యు భయా భయాల ప్రశ్న – 199; మృత్యు పాశ ముక్తి ప్రశ్న – 204; బుద్ధునికి భిక్ష అన్తరాయ ప్రశ్న – 209; అపుణ్య ప్రశ్న – 213; భిక్షు సంఘ పరిహరణ ప్రశ్న – 213; అభేద్య పరిషద్ ప్రశ్న – 215.

**3. ప్రణామిత వర్గం** **218 – 247**

శ్రేష్ఠ ధర్మ ప్రశ్న – 218; సర్వజీవుల హిత వ్యాప్తి ప్రశ్న – 221; వస్త్ర గుహ్యా నిదర్శన ప్రశ్న – 224; పరుష పదాలను ఉపయోగించడంపై ప్రశ్న – 227;

మాటాడే చెట్టు ప్రశ్న – 230; పిండపాత మహా ఫల ప్రశ్న – 231; బుద్ధ పూజ ప్రశ్న – 234; రాతి శకలంతో దెబ్బతిన్న తథాగతుని పాదం ప్రశ్న – 236; ఆస్రవ క్షయమైనవాడు సమణుడు ప్రశ్న – 238; వర్ణభణన ప్రశ్న – 240; అహింసా నిగ్రహ ప్రశ్న – 241; భిక్షులను తిరస్కరించడం ప్రశ్న – 244.

**4. సర్వజ్ఞతా జ్ఞాన వర్గం** **248 – 272**

ఇద్ధి కర్మ విపాక ప్రశ్న – 248; ధర్మవినయ సంవృత, వివృత ప్రశ్న – 250; అబద్ధం విషయాన్నిబట్టి దాని తీవ్రత అతీవ్రత వుంటాయి ప్రశ్న – 252; బోధిసత్త్వ ధర్మ స్వభావం ప్రశ్న – 253; ఆత్మ హత్య ప్రశ్న – 255; మైత్రీ భావనా ప్రయోజన ప్రశ్న – 258; కుశలాకుశల సమ అసమ ప్రశ్న – 260; అమరాదేవి ప్రశ్న – 265; అర్హంత భయపడ పని లేదు ప్రశ్న – 267; బుద్ధ సర్వజ్ఞ భావ ప్రశ్న – 269.

**5. స్నేహ వర్గం** **273 – 299**

స్నేహ (సన్దవ) ప్రశ్న – 273; మితాహార ప్రశ్న – 275; బుద్ధ అల్ప బాధ ప్రశ్న – 277; మార్గ ఉత్పాదన ప్రశ్న – 279; బుద్ధుని అహింస ప్రశ్న – 281; ఆరు దంతాల జోతిపాల గురించిన ప్రశ్న – 284; ఘటీకార ప్రశ్న – 285; బ్రాహ్మణ రాజవాద ప్రశ్న – 287; మంత్ర జపంతో ఆర్జించిన భోజన కథా ప్రశ్న – 290; ధర్మబోధలో నిష్క్రియ ప్రశ్న – 294; బుద్ధునికి గురువు ఉన్నాడా లేడా ప్రశ్న – 297.

## 5. బుద్ధ వర్గం

**1. అనుమాన వర్గం** **300 – 326**

ఒకే సమయంలో ఇద్దరు బుద్ధులు ఎందుకుండరు? – 300; గోతమి వస్త్రదాన ప్రశ్న – 303; ప్రవ్రజితుడు – గృహస్థు ప్రశ్న – 306; మార ద్వేష ప్రశ్న – 307; స్వధర్మ భ్రష్టుల ప్రశ్న – 309; అర్హంతలకు తమ దేహంపై ఎందుకు పట్టు లేదు? ప్రశ్న – 316; సాక్షాత్కార అన్తరాయ ప్రశ్న – 318; దుశ్శీల ప్రశ్న – 321; నీటిలో జీవం ప్రశ్న – 323.

**2. నిష్ప్రపంచ వర్గం — 327 - 340**

అవరోధాలు లేని ప్రపంచ ప్రశ్న - 327; క్షీణాస్రవ భావ ప్రశ్న - 329; అర్హంత దోషాలు ప్రశ్న - 331; లోకంలో లేనిది ప్రశ్న - 332, కారణం లేని వస్తువులు ప్రశ్న - 333; కర్మజాది ప్రశ్న - 336; యక్ష ప్రశ్న - 337; అనవశేష శిక్షా పద ప్రశ్న - 337; సూర్య తపన ప్రశ్న - 338; కఠిన తపన ప్రశ్న - 339.

**3. వెస్సన్తర వర్గం — 341 - 395**

వెస్సంతర దానం ప్రశ్న - 341; తపస్సు ప్రశ్న - 351; కుశలం అకుశలంకంటె బలమైంది ప్రశ్న - 356; పూర్వప్రేతాలకు శ్రాద్ధాల ప్రశ్న - 360; స్వప్నాల ప్రశ్న - 364; అకాల మరణ ప్రశ్న - 368; సమాధివద్ద అద్భుతాల ప్రశ్న - 376; ధర్మసాక్షాత్కార ప్రశ్న - 377; నిర్వాణం సుఖమా, అసుఖమా ప్రశ్న - 380; నిర్వాణ బాహ్యాకృతి ప్రశ్న - 383; నిర్వాణ సాక్షాత్కార ప్రశ్న - 389; నిర్వాణ స్థల ప్రశ్న - 393.

**4. అనుమాన వర్గం — 396 - 434**

అనుమాన ప్రశ్న - 396; ధుతంగా ప్రశ్న - 414.

## 6. ఉపమ - కథా ప్రశ్నలు

విషయసూచిక (మాతికా)

**1. గార్దభ వర్గం — 435 - 445**

గార్దభం - 435; కోడిపుంజు - 435; ఉడుత - 438; దీపిని (ఆడుచిరుత) - 438; దీపిక (మగచిరుత) - 439; తాబేలు - 440; వెదురు - 442; చాపం - 443; వాయసం (కాకి) - 443; మర్కటం - 444.

**2. సముద్ర వర్గం — 446 - 455**

సొరతీగె - 446; పద్మం - 446; బీజం - 447; సాలవృక్షం - 448; నావ - 449; లంగరు - 450; కూప తెరచాప - 450; నావికుడు - 451; కర్మకారుడు (నావిక) - 452; సముద్రం - 452.

**3. పృథివీ వర్గం** **455 - 468**

పృథివి - 455; నీరు - 456; అగ్ని - 458; వాయువు - 459; పర్వతం - 460; ఆకాశం - 462; చంద్రుడు - 463; సూర్యుడు - 464; ఇంద్రుడు - 466; చక్రవర్తి - 467.

**4. ఉపచికా (చెదలు) వర్గం** **469 - 478**

చెదలు - 469; పిల్లి - 469; ఎలుక - 470; తేలు - 471; ముంగిస - 471; ముసలి మగ నక్క - 472; మృగ (లేడి) - 473; ఎద్దు - 474; పంది - 476; ఏనుగు - 476.

**5. సింహవర్గం** **479 - 487**

సింహం - 479; చక్రవాకం - 481; పేణాహిక పక్షి - 482; ఇంటి పావురం - 482; గుడ్లగూబ - 483; శతపత్ర పక్షి - 484; గబ్బిలం - 484; జలగ - 485; సర్పం - 486; కొండచిలువ - 487.

**6. సాలీడు వర్గం** **488 - 495**

వీధీ సాలీడు - 488; స్తన్యం గ్రోలే పసిబిడ్డ - 488; నేల తాబేలు - 489; మహారణ్యం - 489; వృక్షం - 490; మేఘం - 491; మణిరతన - 492; వేటకాడు - 493; జాలరి - 494; వడ్రంగి - 495.

**7. కుంభ వర్గం** **496 - 504**

నీటి కుండ - 496; నల్ల ఇనుము - 496; గొడుగు - 497; పొలం - 498; విరుగుడు మందు - 499; భోజనం - 500; విలుకాడు - 501; నిగమనం - 503.

నమో తస్స భగవతో అరహతో సమ్మా సంబుద్ధస్స

# ఖుద్దక నికాయ

# నాగసేన-మిళింద సంవాదం[1]

1. పూర్వం బాగా ప్రసిద్ధి చెందిన సాగల నగరం వద్ద రాజు మిళింద ప్రపంచ ప్రఖ్యాత రుషి నాగసేనుని కలిశాడు. రాజా మిళింద, గంభీరమైన గంగానది అంతకంటే గంభీర సాగరంలోకి ప్రవహించినట్లుగా వాగ్ధురంధరుడైన, సత్యానికి దివిటీ పట్టేవాడైన (ఉక్కాధారుడైన), మనుషుల మనస్సుల చీకటిని పారదోలేవాడైన అతనికి (నాగసేనునికి) సూక్ష్మమైన, జటిలమైన అనేక ప్రశ్నలను, అనేక విషయాలమీద వేశాడు. అంతట సమాధానాలు ఇవ్వబడ్డాయి.

(ఆ సమాధానాలు) అర్థవంతమైనవి, హృదయంగమమైనవి, వినసొంపైనవి (కర్ణపేయమైనవి), అభూతమైనవి, అపూర్వమైనవి.

ఎందుకంటే నాగసేనుని సమాధానాలు అభిధమ్మ, వినయ సూత్రాల లోతులను తాకాయి.

సూత్ర జాలాలను ఛేదిస్తూ

గొప్ప రూపకాలతో, హేతువుతో ప్రభాసం చేస్తూ.

అయితే రండి! మీ మనస్సులకు పని చెప్పండి, మీ హృదయాలను ఆనందించనీయండి,

ఈ సూక్ష్మ ప్రహేళికలను వినండి

సందేహ మూలాలన్నీ పటాపంచలవుతాయి.

❀ ❀ ❀

2. సంప్రదాయం ఇలా వాకొంటున్నది– యోనకుల[2] దేశంలో ఒక గొప్ప వాణిజ్య కేంద్రం ఉంది. ఆ నగరం పేరు సాగల. అది రమణీయ భూ ప్రదేశంలో ఉంది. నదీ పర్వత శోభితం. దాని నిండా వనాలు, తోటలు, వృక్షశ్రేణులు, సరస్సులు, తటాకాలతో కూడి, నదీ పర్వత అటవీ స్వర్గంలా ఉంది. మంచి తెలివైన వాస్తు శిల్పులు దానిని నిర్మించారు. వారికి శత్రుభయం లేదు. ఎందుకంటే వారి విరోధులు, వ్యతిరేకులు పూర్తిగా అణచబడ్డారు. దాని రక్షణ దుర్భేద్యం. బలమైన గోపుర తోరణాలతో, పరిక్ఖాల (ప్రాకారాలు) తో పెద్దపెద్ద హజారాల (ద్వారాలు) తో నిర్మించబడింది. మధ్య కోట, చుట్టూ తెల్లని గోడలు, వాటి చుట్టూ అగడ్తలు, వీథులు చదరంగా ఉండి, కూడళ్ళతో, అంగళ్ళతో వెలసింది. వివిధ రకాలైన వ్యాపార సామగ్రితో అక్కడి అంగళ్ళు మెరిసి పోతుంటాయి. దాని నిండా అనేక ధర్మశాలలు, హిమాలయ పర్వత శిఖర సమానమైన వందల వేల అద్భుత భవనాలు ఉంటాయి. వీథులు ఏనుగులతో, అశ్వాలతో, బళ్ళతో, కాలి నడక ప్రయాణికులతో, అందమైన మగవారితో, సుందర నారీమణులతో, రకరకాల పరిస్థితులలో ఉన్నవారితో, బ్రాహ్మణులతో, క్షత్రియులతో, పనివారలతో, సేవకులతో నిండి ఉంటాయి. వివిధ మత శాఖలకు చెందిన మతాధిపతులకు స్వాగత వచనాలు అక్కడ మారుమోగు తుంటాయి. వివిధ మతాధిపతులకు ఆ నగరం విశ్రాంత స్థలం. అక్కడ దుకాణాలలో కాశీ పట్టు వస్త్రాలు, కొతుంబర వస్త్రాలు, ఇంకా అనేక రకాల ఇతర వస్త్రాలు అమ్ముతారు. అక్కడి వీథుల్లో అభిరుచుల కనుగుణంగా పుష్పాలను, సుగంధాలను అమరుస్తారు గనుక, జనం మధుర గంధాలను ఆఘ్రాణిస్తారు. మగవారి హృదయాలు మెచ్చే నగలు అక్కడ కోకొల్లలు. ఆకాశం నలు దిక్కుల కనిపించే వీలుగా అంగళ్ళలో తళుకు బెళుకు దుస్తులు ప్రదర్శిస్తారు. అది ధన నగరం. బంగారు, వెండి, రాగి, రాతి వస్తువులు విరివిగా ఉంటాయి. అది మిరుమిట్లు గొలిపే సంపదల నిలయం. ఆస్తిపాస్తులు, ధాన్యం, విలువైన వస్తువులు నిలువ, పదార్థాలు, మధువులు లభిస్తాయి. సంపదలో అది ఉత్తర కుబేరుని, వైభవంలో దేవనగరమైన అళకమందాను తలదన్నింది.

3. ఇంతవరకు చెప్పిన తరవాత ఇప్పుడు మనం ఈ ఇద్దరు వ్యక్తుల (మిళింద, నాగసేనల) పూర్వజన్మ చరిత్రలను, వివిధ రకాల ప్రహేళికల (చిక్కు ప్రశ్నల) గురించి చెప్పవలసి ఉంది. దీనిని మనం ఈ దిగువ ఆరు శీర్షికల క్రింద చెప్పుకుందాం:

1. వారి పూర్వయోగం (పూర్వ చరిత్ర). 2. మిళింద ప్రశ్నలు. 3. లక్షణ ప్రశ్నలు (వేరు చేసి చూపే లక్షణాలకు సంబంధించిన ప్రశ్నలు.) 4. మేణ్డక ప్రశ్నలు

(విరుద్ధ వాక్యాల నుంచి ఉత్పన్నమయ్యే ప్రశ్నలు) 5. అనుమాన ప్రశ్నలు (అస్పష్టత నుంచి జనించే ప్రశ్నలు) 6. ఓపమ్మ కథా ప్రశ్నలు (ఉపమానం మీద తిరిగే ప్రశ్నలు.)

వీటిలో మిళింద ప్రశ్నలు ద్వివిధాలు: 1. లక్షణ ప్రశ్నలు 2. విమతిచ్ఛేదన ప్రశ్నలు – సందేహ నివృత్తి లక్ష్యంగా ఉన్న ప్రశ్నలు. మేణ్డక ప్రశ్నలు రెండు విధాలు: 1. మహావర్గం (సుదీర్ఘ ప్రశ్నలు) 2. యోగి కథా ప్రశ్నలు (యోగి జీవితంలోని సమస్యలు).

---

1. నాగసేన – మిళింద సంవాదం (మిళింద ప్రశ్నలు గ్రంథం) ప్రాముఖ్యాన్నిబట్టి బర్మా బౌద్ధులు దానిని ఖుద్దక నికాయంలో చివరి గ్రంథంగా చేర్చారు. ఇతర బౌద్ధ దేశాలలో ఇది ఖుద్ధక నికాయంలో లేదు.

2. అనగా అయోనియనులు. బాక్ట్రియన్ గ్రీకులను పాళీలో యోనకులంటారు.